సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 13 । ఆగస్టు । 2023



రాష్ట్రస్థాయి పోటీలు

భీమవరంలో 16వ రాష్ట్రస్థాయి రోప్‌స్కిప్పింగ్, 4వ రాష్ట్రస్థాయి మల్లఖంబ్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. 8లో ▸



పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. 8లో ▸

బంగారు తల్లీ.. కల్పవల్లీ

భీమవరం మావుళ్లమ్మవారికి వంద కిలోల స్వర్ణాభరణాల అలంకరణలో భాగంగా ఇప్పటివరకు 72 కిలోలను భక్తుల నుంచి సేకరించారు. 8లో



మా'స్టార్'లుగా.. మార్చాలని..

- పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకం
- సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నాయకత్వ లక్షణాలపై శిక్షణ
- మూడు జిల్లాల పరిధిలో 1,468 మందికి ట్రైనింగ్
- నాలుగు బ్యాచ్‌ల్లో 800 మందికి పూర్తి
- నెలాఖరు వరకు కొనసాగనున్న లీడర్‌షిప్ ప్రోగ్రాం



తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ స్కూల్‌లో లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌ఎంలు

జిల్లాలు : ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్

ప్రధానోపాధ్యాయుల సంఖ్య	శిక్షణ పూర్తి చేసుకున్న వారు
1,468	800
ఇప్పటివరకు పూర్తయిన బ్యాచ్‌లు	**ఒక్కో బ్యాచ్ శిక్షణ రోజులు**
4	6

షెడ్యూల్ : ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు

నూజివీడు: రాష్ట్రంలో విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. జగనన్న గోరుముద్ద, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి సంక్షేమ పథకాలతో పాటు నాడు–నేడు కింద ప్రభుత్వ బడుల రూపురేఖలు దశల వారీగా మారుస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పిస్తూ పేద విద్యార్థులకు నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం చదువులను చేరువ చేశారు. అలాగే వేలాది మంది ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించి యూపీ, ఉన్నత పాఠశాలల్లో 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ ఉపాధ్యాయులను నియమించారు. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్–2 హెచ్‌ఎం పోస్టులను నూరు శాతం భర్తీ చేశారు.

నాయకత్వ సాధికారతకు..

పాఠశాలలను దిశానిర్దేశం చేసే ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలు అవశ్యం. పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించే మంచి నాయకుడిగా హెచ్‌ఎంలను తీర్చిదిద్దే లక్ష్యంతో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాల నాయకత్వంపై వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ స్కూల్‌లో గతనెల 6వ తేదీ నుంచి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శిక్షణ షెడ్యూల్, కోర్సును ఏపీ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (ఏపీ సీమాట్) సంస్థ రూపొందించింది. ఏలూరు రీజియన్ పరిధిలోని ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన 1,468 మంది హెచ్‌ఎంలకు రెసిడెన్షియల్ విధానంలో ప్రత్యేక వృత్యంతర శిక్షణ కార్యక్రమం జాయింట్ డైరెక్టర్, శిక్షణా తరగతుల కోర్సు డైరెక్టర్ బి.విజయభాస్కర్ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతోంది. ఇప్పటివరకూ బ్యాచ్‌కు 6 రోజుల చొప్పున నాలుగు బ్యాచ్‌ల్లో 800 మంది హెచ్‌ఎంలకు శిక్షణ పూర్తిచేసినట్టు విజయభాస్కర్ తెలిపారు.

సమగ్రంగా.. సంపూర్ణంగా..

ప్రభుత్వ పాఠశాలలు సమర్థవంతంగా నిర్వహించాలంటే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు తప్పనిసరిగా దృఢమైన నాయకత్వ లక్షణాలు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలోంచి రూపొందిందే పాఠశాల నాయకత్వంపై శిక్షణ. దీనిని సమగ్రంగా, సంపూర్ణంగా ప్రధానోపాధ్యాయులకు అందించాలనే లక్ష్యంతో తొలిసారిగా రెసిడెన్షియల్ విధానంలో శిక్షణను నిర్వహిస్తున్నట్టు ఏలూరు డీఈఓ పి.శ్యామ్ సుందర్ తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణలో అంశాలు

- ఉపాధ్యాయులకు తరగతుల కేటాయింపు.
- నిధుల వినియోగం.
- విద్యార్థుల నమోదు.
- హాజరు పెంపుదల.
- మధ్యాహ్న భోజనం.
- జేవీకే కిట్స్ పంపిణీ.
- విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధి.
- డిజిటల్ విద్యా విధానం అమలు.
- నాడు–నేడు పనుల పర్యవేక్షణ.
- టోఫెల్.
- రోజుకో ఆంగ్ల పదం నేర్చుకోవడం.
- ఓఎంఆర్ ద్వారా సీబీఏ పరీక్షలు.
- విద్యాసంబంధిత యాప్‌ల నిర్వహణ.
- స్వీయ అవగాహనతోపాటు టీమ్‌వర్క్‌తో పాఠశాలను అభివృద్ధి చేయడం.
- సహ ఉపాధ్యాయుల సమన్వయంతో లక్ష్యాన్ని పూర్తిచేయడం.
- విద్యా వ్యవస్థలో మార్పులను ఆకళింపు చేసుకోవడం.

సామర్థ్యాలకు సానబెడుతూ..



హెచ్‌ఎంలలో సహజ సామర్థ్యాలకు అనుగుణంగా వారిలోని నాయకత్వాన్ని మరింత పెంపొందించేలా సానబెడుతున్నాం. తద్వారా పాఠశాల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు వారే స్వతహాగా పరిష్కరించుకోగలరు. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్)లో భాగంగా హెచ్‌ఎంలకు ఈ శిక్షణ అందిస్తున్నాం.

–డాక్టర్ ఆర్ అరుణ, రాష్ట్ర పరిశీలకురాలు, సమగ్ర శిక్ష

రెసిడెన్షియల్ విధానంలో..



ఏలూరు రీజియన్‌లోని మూడు జిల్లాలకు సంబంధించిన హైస్కూల్, యూపీ, ఎల్ఎఫ్ఎల్, మోడల్, కేజీబీవీ, మున్సిపల్, సోషల్ వెల్ఫేర్ స్కూళ్లలోని హెచ్‌ఎంలకు పూర్తిస్థాయి రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ అందిస్తున్నాం. వసతి, భోజన సదుపాయాలు కల్పించి సమగ్ర శిక్ష ద్వారా ఆహ్లాదకర వాతావరణంలో శిక్షణ ఇస్తున్నాం.

– ఏవీ ఎస్ఎన్ భాస్కర్‌కుమార్, కోర్సు ఇన్‌చార్జ్, లీడర్‌షిప్ ప్రోగ్రాం

మరింత పరిజ్ఞానం



పాఠశాల నిర్వహణలో నాయకత్వంపై మరింత పరిజ్ఞానం పొందాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తోటి ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుని మంచి ఫలితాలు సాధించేందుకు శిక్షణ దోహదపడుతుంది. సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

– ఎ.అనురాధ, హెచ్‌ఎం, యూపీ స్కూల్, చొప్పరమెట్ల

సమాజ భాగస్వామ్యంపై..



పాఠశాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని ఎలా వినియోగించుకోవాలి, వారి నుంచి వచ్చే మంచి, చెడు ఫలితాలను ఎలా ఎదుర్కోవాలో తెలుసుకున్నాం. సమస్యలను సమర్థంగా ఎదుర్కోగలమనే నమ్మకం కలిగింది. ఉదయం 5 గంటల నుంచి మాకు నేర్పిన యోగాసానాలు విద్యార్థులకు నేర్పుతాం.

– ఎస్‌కే మస్తాన్, హెచ్‌ఎం, యూపీ స్కూల్, అన్నేవారిగూడెం

న్యూస్‌రీల్

సూర్యతేజ సేవలు ప్రశంసనీయం



సబ్ కలెక్టర్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): నరసాపురం సబ్ కలెక్టర్‌గా సూర్యతేజ అందించిన సేవలు అభినందనీయమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం ఐటీడీఏ పీఓగా బదిలీ అయిన సూర్యతేజ ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యతేజ దంపతులను పూలమాలలతో సత్కరించి కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలో సీఎం జగన్ పర్యటించినప్పుడు ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత చేరువ చేసేందుకు తెలుగు అబ్బాయి, ఐఏఎస్ చదివిన సూర్యతేజను మీకు అధికారిగా పంపుతున్నానని గిరిజనులతో అన్నారని, ఇంతకంటే ఏంకావాలని అన్నారు. సూర్యతేజ అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో కె.కృష్ణవేణి, ఆర్డీఓ దాసిరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా మురాల



జిల్లా అధ్యక్షుడిని సత్కరిస్తున్న నాయకులు

తణుకు అర్బన్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైందని అటువంటి వృత్తిలో ఉన్నందుకు ఉపాధ్యాయులంతా గర్వపడాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య అన్నారు. తణుకు మున్సిపల్ యూపీ స్కూలులో శనివారం వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ (వైఎస్సార్‌టీఎఫ్) విద్యా సదస్సును రాష్ట్ర నాయకులు బీజే ప్రభువరం అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం విద్యాశాఖకు కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిందన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కమిటీ సభ్యులు : జిల్లా అధ్యక్షుడిగా మురాల సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌వీవీఎం శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా కె.శ్యామ్‌సుందర్ క్రైస్టసన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.రాధాకృష్ణ, కోశాధికారిగా కె.సత్యనారాయణ నియమితులయ్యారు. ఎంఈఓ ఎస్.శ్రీనివాసరావు, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వీవీఎం శ్రీనివాస్, వైఎస్సార్ సేవాదళ్ రీజినల్ కో–ఆర్డినేటర్ చినిమిల్లి వెంకటరాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఏఎంసీ చైర్మన్ నత్త కృష్ణవేణి పాల్గొన్నారు.

వరద బాధితులకు నగదు జమ

భీమవరం (ప్రకాశంచౌక్): ఇటీవల గోదావరి వరద కారణంగా పునరావాసం పొందిన ప్రతి కుటుంబానికీ నగదు అందించామని కలెక్టర్ పి.ప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందిన దొడ్డిపట్ల గ్రామంలోని 204 కుటుంబాలకు రూ.2 వేల చొప్పున, సింగిల్ పర్సన్స్ 8 మందికి రూ. వెయ్యి చొప్పున అందించామని పేర్కొన్నారు. యలమంచిలి మండలంలో కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, యలమంచిలిలంక, ఏనుగువానిలంక, గంగడుపాలెం, అబ్బిరాజుపాలెం, నార్ని మెరక, బాడవ, శిరగాలపల్లి, కంచుస్తంభం పాలెం, బూరుగుపల్లి గ్రామాల్లో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా పెద్దెత్తున నిత్యావసర సరుకులు, తాగునీరు, వైద్య సాయం అందించామని పేర్కొన్నారు. మొత్తంగా 4,023 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని, ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పామాయిల్, వంకాయలు, పచ్చిమిర్చి అందించామని పేర్కొన్నారు. వరద తొలగిన అనంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు.

త్యాగధనులు.. స్ఫూర్తి ప్రదాతలు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



మొక్కలు నాటుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన త్యాగధనులను స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా వసుధకు వందనం కార్యక్రమంలో తణుకు 14వ వార్డు పల్లాలమ్మ నగర్‌లో శనివారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ 75వ స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా అమర వీరుల గుర్తుగా ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కలు భావి తరాల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తాయని, పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయన్నారు. మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, దున్నల ఉమామహేశ్వరరావు, బోయిడి అన్నవరం, మల్లుల సత్యనారాయణ, కొఠారు రామాంజనేయులు, కుడుపూడి చంద్రరావు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

వీరులకు వందనం

భీమవరం (ప్రకాశంచౌక్): స్వాతంత్ర్య సమరంలో అసువులు బాసిన వీరులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తిని పొందాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో క్విట్ ఇండియా స్వాతంత్రోద్యమ అమరవీరుల స్థూపం వద్ద వీరులకు వందనం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీరులకు వందనం పేరిట వారిని స్మరించుకుంటూ, వారి కుటుంబ సభ్యులను సన్మానిస్తామన్నారు. స్వాతంత్ర సమరయోధులు పస్తుల సాగర్ మనవడు హరిప్రసాద్, అడవి బాపిరాజు మనవడు కేకేఆర్ కృష్ణమోహన్‌ను కలెక్టర్ దుశ్శాలువాతో సత్కరించారు. ఆర్డీఓ దాసిరాజు, డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, ఎవరికీ విధేయులుగా ఉండరాదని కలెక్టర్ ప్రశాంతి బీఎల్‌ఓలను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలిసి ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా–2024లో భాగంగా సర్వేపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

డీజీపీకి సత్కారం



డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న ఆస్పత్రి యాజమాన్యం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిని రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి శనివారం సందర్శించారు. నరసాపురంలో డీఎస్పీ కార్యాలయం నూతన భవనం ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన పాలకొల్లులో మిత్రుడు తటవర్తి కృష్ణమూర్తికి చెందిన ప్రైవేటు ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో ఐసీయూను పరిశీలించి ఉచిత సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి యాజమాన్యం ఆయన్ను గజమాలతో సత్కరించింది. ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, ఆస్పత్రి నిర్వాహక సభ్యులు అడ్డాల వాసు, టి.సురేష్, తటవర్తి సుధాకర్, డాక్టర్ లక్ష్మీపతిరాజు, డాక్టర్ లెనిన్, డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా సీఎం జగన్

- ఎమ్మెల్యే నిమ్మలది తప్పుడు ప్రచారం
- ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఆగ్రహం

పాలకొల్లు అర్బన్: వరద బాధితులకు పెద్ద మొత్తంలో సహాయం చేసి వారికి అండగా నిలిచిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తెలిపారు. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మీడియాని వెంట పెట్టుకుని పబ్లిసిటీ కోసం తాపత్రయపడుతూ యలమంచిలి మండలం కనకాయలంకలో తప్పుడు ప్రచారం చేయడంపై శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. వరద బాధితుల కష్టాలను ముందే గమనించి ప్రభుత్వం రూ.2 వేల ఆర్థిక సహాయంతో పాటు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు అందించిందని పేర్కొన్నారు. ఇంటి చుట్టూ వరద నీరు చేరిన కుటుంబాలకు సైతం సాయం అందించిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వరదలు వస్తే బాధితులకు బియ్యం మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. అయితే సీఎం జగన్ అన్ని విధాలా ఆదుకున్నారన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం నిమ్మల చేస్తే ప్రజలే గుణపాఠం చెబుతారని దుయ్యబట్టారు.



గుమ్ములూరులో నేలకొరిగిన మర్రిచెట్టు

ఈదురుగాలులు.. జోరువాన

ఆకివీడు: ఈదురుగాలులు, భారీ వర్షానికి గుమ్ములూరులో వందేళ్ల నాటి మర్రిచెట్టు శుక్రవారం రాత్రి నేలకొరిగింది. కుండపోత వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గత 24 గంటల్లో అత్యధికంగా 26.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

శ్రీవారి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



ఆలయ అనివేటి మండపంలో కిక్కిరిసిన భక్తులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్యక్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు, ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారు జాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంతో పాటు, అనివేటి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి.

16 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు

పెంటపాడు: పాలిసెట్-2023లో ఉత్తీర్ణులై ర్యాంక్ వచ్చిన అభ్యర్థులు ఈనెల 16 వరకు జరిగే వెబ్ ఆప్షన్‌లు నమోదు చేయించుకోవాలని గూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యులు, పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్ డి.ఫణీంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్, గూడెం పాలిటెక్నిక్ కళాశాలలో, ఏదైనా నెట్ సెంటర్‌లో నచ్చిన కోర్సు ఎంపిక చేసుకుని ప్రథమ సంవత్సరంలో చేరేందుకు వెబ్‌ఆప్షన్ ఇవ్వాలని సూచించారు. సీట్ల కేటాయింపు ఈ నెల 18న జరుగుతుందన్నారు. 19 నుంచి 23లోగా సంబంధిత కళాశాలలో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బంగారు తల్లీ.. కల్పవల్లీ

అమ్మలగన్న అమ్మ భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని పూర్తి స్వర్ణమయ అలంకరణలో చూడాలని భక్తుల కోరిక. అమ్మవారికి వంద కిలోలతో సకల స్వర్ణాభరణాలను సిద్ధం చేసే దిశగా గత 12 ఏళ్లుగా దాతలు, భక్తులు విరాళాలు విరివిరిగా అందిస్తున్నారు. ఇప్పటికే 72 కిలోల మేర పసిడి సమకూరగా, నూరు శాతం లక్ష్యం దిశగా మావుళ్లమ్మ దేవస్థానం పాలకవర్గం, దాతలు, భక్తులు కృషి చేస్తున్నారు.

- భీమవరం మావుళ్లమ్మకు వంద కిలోలతో సకల స్వర్ణాభరణాలే లక్ష్యం
- ఇప్పటికే భక్తుల విరాళాల ద్వారా 72 కిలోల పసిడి సేకరణ
- సిద్ధంగా 51 కిలోల బంగారపు వస్తువులు
- 13 కిలోలతో నగల తయారీకి అనుమతి



అమ్మవారికి బంగారం సమర్పిస్తున్న భక్తులు (ఫైల్)



బంగారు ఆభరణాలతో శ్రీమావుళ్లమ్మ అమ్మవారు

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని బంగారం చీరతో అలంకరించాలని మొదట నిర్ణయించగా, తర్వాత అమ్మవారిని పూర్తి స్వర్ణమయం చేయాలని, అందుకు సుమారు 100 కిలోల వరకు బంగారం సేకరణ చేయాలని లక్ష్యంగా మారింది. అమ్మ దయతో ఆర్థికంగా ఎదిగినవారు, అమ్మవారి ఆశీస్సులతో తమ కుటుంబాలు బాగున్నాయని అనుకున్న వారు అమ్మవారి స్వర్ణమయంలో తాము భాగం కావాలని స్తోమతను బట్టి 2 గ్రాముల నుంచి 100 గ్రాముల వరకు బంగారం అందిస్తున్నారు. దేశ, ఇతర దేశాల నుంచి సైతం వచ్చి అమ్మవారికి బంగారాన్ని విరాళంగా అందిస్తుండటం విశేషం. కరోనా వల్ల మధ్యలో రెండేళ్లు బంగారం సేకరణకు విరామం రాగా, గత ఏడాది నుంచి బంగారం విరాళాలు యధావిధిగా కొనసాగుతున్నాయి.

పసిడి చీర ఆలోచనతోనే మొదలు


శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని స్వర్ణమయం చేయాలని లక్ష్యంతో సుమారు 12 ఏళ్ల క్రితం అప్పటి ట్రస్ట్ బోర్డు, దాతలు, పట్టణ ప్రముఖులు అమ్మవారి చీరకు బంగారం విరాళం సేకరించాలని ఆలోచన రావడంతో ఇక అప్పటి నుంచి బంగారం విరాళాలు వస్తున్నాయి. ఇప్పటివరకు దాతలు, భక్తుల నుంచి అమ్మవారికి సుమారు 72 కిలోల 82 గ్రాముల 930 మిల్లి గ్రాముల బంగారం సేకరించారు. అందులో ఇప్పటివరకు సుమారు 51 కిలోల 308 గ్రాముల 145 మిల్లీ గ్రాములతో అమ్మవారికి ఆభరణాల తయారు చేయించి అమ్మవారికి అలంకరించారు. మరో సుమారు 13 కిలోల బంగారంతో ఆభరణాలు చేయించడానికి సిద్ధం చేసి ఉన్నతాధికారుల అనుమతులు తీసుకుని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

బంగారం విరాళాన్ని ఇచ్చే దాతలు, భక్తులు తొంతరగా ముందుకు రావాలి

అమ్మవారికి బంగారం విరాళం అందించాలని ఆలోచనతో ఉన్న దాతలు స్పందిస్తే అమ్మవారిని స్వర్ణమయంలో చూడాలని భక్తుల కోరిక వేగంగా నేరవేరుతుంది. శ్రీమావుళ్లమ్మ అమ్మవారు పూర్తి స్వర్ణమయంగా మారితే దేశంలో ఎక్కడ లేని విధంగా నిలువెత్తు బంగారమయ విగ్రహంగా ఎనలేని ఖ్యాతి అమ్మవారికి దక్కుతుంది.

ఇప్పటివరకు ఉన్నవి ఇవే





అమ్మవారికి ఇప్పటివరకు సుమారు 51 కిలోల బంగారంతో కిరీటం, భుజపాదులు, కత్తి, త్రిశూలం, చేతిపిడికిలి తదితర ఆభరణాలు తయారు చేయించి అలంకరణ చేశారు. అమ్మవారికి ఇప్పటివరకు సేకరించిన 72 కిలోల 82 గ్రాముల బంగారం.. ప్రస్తుతం ఉన్న ధర ప్రకారం రూ.36.4 కోట్ల విలువ ఉంటుందని అంచనా. అలాగే అమ్మవారికి బంగారంతో పాటు వెండి కూడా భక్తులు, దాతలు సమర్పిస్తుంటారు. ఇప్పటివరకు వెండి 351 కిలోల 179 గ్రాముల 879 మిల్లీ గ్రాములు విరాళంగా రాగా, 191 కిలోలతో ఆలయంలో అలకరణ చేశారు. ఈ వెండి విలువ రూ.25 లక్షల వరకు ఉంటుంది.

విరివిగా విరాళాలివ్వాలి



అమ్మవారికి ఇప్పటివరకు సుమారు 51 కిలోలతో బంగారు ఆభరణాలు అలంకరించగా, మరో 13 కిలోలతో ఆభరణాలు తయారు చేయించడానికి ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకున్నాం. అలాగే వెండితో కూడా అమ్మవారి గర్భగుడిలో అలంకరణ చేయడానికి కూడా ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. దాతలు, భక్తులు విరివిగా విరాళాలు ఇవ్వాలి.

– యర్రంశెట్టి భద్రాజీ, ఆలయ సహాయ కమిషనర్, శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ ఏవీ శేషసాయికి శ్రీవారి మెమెంటోను అందజేస్తున్న ఆలయ ఏఈఓ లక్ష్మణస్వామి

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి శనివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారి నిత్యార్జిత కల్యాణ వేడుకలో సతీసమేతంగా పాల్గొన్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు, పెన్మత్స నరసింహరాజు తదితరులున్నారు.

మద్ది అంజన్న సేవలో..

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామిని శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం పండితులతో వేద ఆశీర్వచనం అందించి శేషవస్త్రం కప్పి సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

'పీవీ రావు' జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసు

కాళ్ల: పీవీ రావు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడిగా ఎల్ఎన్ పురం గ్రామానికి చెందిన మైలా శ్రీనివాసును రాష్ట్ర కమిటీ నియమించింది. సంఘం రాష్ట్ర స్థాయి అత్యవసర సమావేశం శనివారం ఎల్ఎన్ పురం గ్రామంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్య వరప్రసాదరావు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షునిగా మైలా శ్రీనివాసును నియమించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నమండ బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు గోడి పెద్దిరాజు, కొల్రపాటి వీరస్వామి, కుమార్ స్వామి, డి షద్రక్కు, పిల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ నాయకత్వంతోనే పాఠశాల సమగ్ర అభివృద్ధి

- విద్యాశాఖ జేడీ విజయ భాస్కర్
- ముగిసిన హెచ్ఎంల నాలుగో బ్యాచ్ శిక్షణా తరగతులు



తోటపల్లి హీల్ ప్యారడైజ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న హెచ్ఎంలు

ఆగిరిపల్లి (నూజివీడు): ఉత్తమమైన నాయకత్వంతోనే పాఠశాల సమగ్రాభివృద్ధి సాధ్యమని కోర్సు డైరెక్టర్, విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ అన్నారు. తోటపల్లి హీల్ ప్యారడైజ్ స్కూల్‌లో ఈనెల 7వ తేదీ నుంచి ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని 194 మంది ప్రధానోపాధ్యాయులకు ఆరు రోజులపాటు పాఠశాల నాయకత్వంపై నిర్వహించిన వృత్యంతర శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ స్కూల్ లీడర్‌షిప్ శిక్షణలో బోధించిన ప్రతి అంశాన్ని పాటించి పనిచేస్తున్న పాఠశాలలు అన్ని అంశాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేసి మంచి నాయకత్వ లక్షణం ఉన్న ప్రధానోపాధ్యాయులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ముందుగా ఈ శిక్షణలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు రూ. 1,69,493 లను నగదును ఆన్‌లైన్‌లో హీల్ సంస్థ కార్యదర్శి తాతినేని లక్ష్మికి అందించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న హెచ్ఎంలకు సర్టిఫికెట్‌లను నిర్వాహకులు అందించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ ఆర్.అరుణ, కోర్స్ ఇన్‌చార్జి ఏవీ ఎస్ఎన్ భాస్కర్‌కుమార్, ఎంఈవో బట్టు సురేష్‌కుమర్, మాస్టర్ ట్రైనీలు తదితరులున్నారు.

గడపగడపకు సంక్షేమం



తణుకు అర్బన్ : తణుకు 9వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ

ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

తాడేపల్లిగూడెం రూరల్: ఎదురెదురుగా వస్తున్న ఆటో, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్, మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదతాడేపల్లికి చెందిన సూరాడ రామకృష్ణ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో తాడేపల్లిగూడెం వెళ్లి తిరిగి వస్తున్నాడు. పెదతాడేపల్లి వద్ద డైవర్షన్ సూచనతో ఒకే మార్గంలో ఎదురెదురుగా వచ్చిన ఆటో, ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సూరాడ రామకృష్ణ, అతని అత్త, వదినలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వేర్వేరు ఆసుపత్రులకు తరలించి, చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మల్లఖంబ్, రోప్ స్కిప్పింగ్ రాష్ట్ర పోటీలు ప్రారంభం



రోప్ స్కిప్పింగ్ పోటీల్లో క్రీడాకారిణుల విన్యాసాలు

సాక్షి, భీమవరం: భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం స్కూల్లో 16వ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్, నాలుగో రాష్ట్ర స్థాయి మల్లఖంబ్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పోటీలను డీఎన్నార్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు గోకరాజు వెంకటనర్సింహరాజు ప్రారంభించి మాట్లాడుతూ క్రీడలపై ఆసక్తి ఉంటే విద్యలో సైతం ఉన్నత స్థానానికి ఎదగవచ్చన్నారు. పోటీలకు 17 జిల్లాలకు చెందిన రోప్ స్కిప్పింగ్ క్రీడాకారులు సుమారు 350 మంది, మల్లఖంబ్ పోటీలకు 170 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రెండు రోజులపాటు పోటీలు నిర్వహిస్తామని మల్లఖంబ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పురిఘళ్ల రఘురామ్, జీసీపీ శేఖర్‌రాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, కొత్తపల్లి శివరామరాజు, చెరుకువాడ రంగసాయి, పి.రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత



వెంకటేశ్వర్లుకు బంగారు గొలుసు అందిస్తున్న సీఐ నవీన్ నరసింహమూర్తి

హనుమాన్ జంక్షన్ రూరల్ : బంగారు గొలుసు పోగొట్టుకున్న వ్యక్తికి ఆరురోజుల వ్యవధిలోనే హనుమాన్‌జంక్షన్ పోలీసులు ఆ గొలుసు ఆచూకీ కనిపెట్టి అందించారు. వివరాల్లోకి వెళ్లితే.. పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన జాగర్లమూడి వెంకటేశ్వర్లు తన కుటుంబంతో కలిసి ఈ నెల 6న గుంటూరు వచ్చి తిరిగి వెళుతూ మార్గంమధ్యలో 16వ నంబర్ జాతీయ రహదారిపై బాపులపాడు మండలం బొమ్ములూరు టోల్‌గేట్ వద్ద ఉన్న ఓ రెస్టారెంట్‌లో భోజనం చేసేందుకు ఆగారు. ఆ తరుణంలో వెంకటేశ్వర్లు కుమారుడి మెడలోని సుమారు రూ.1.50 లక్షల విలువ చేసే మూడు కాసుల బంగారు గొలుసు కనిపించలేదు. హోటల్ ప్రాంగణంలో వెదికినా దొరకకపోవటంతో హనుమాన్ జంక్షన్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి ఆదేశాలతో పోలీస్ సిబ్బంది రెస్టారెంట్ ప్రాంగణంలోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. హోటల్ వద్ద గొలుసు జారిపడిన కొద్దిసేపటి తర్వాత ఓ వ్యక్తి దాన్ని తీసుకోవటం పోలీసులు గుర్తించారు. అతని ఆచూకీ తెలుసుకుని, విషయం ఆరా తీయగా ఆ వ్యక్తి బంగారు గొలుసును పోలీసులకు అప్పగించాడు. శనివారం వెంకటేశ్వర్లుకు బంగారు గొలుసును సీఐ అందించారు. ఈ కేసు విచారణలో చురుగ్గా వ్యవహరించిన కానిస్టేబుల్ షేక్ నబీని సీఐ నవీన్ నరసింహమూర్తి అభినందించారు.

అల్లంచర్ల కొత్తగూడెంలో భూవివాదం



అల్లంచర్ల కొత్తగూడెంలో ఇరువర్గాలతో చర్చిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

టి.నరసాపురం: అల్లంచర్ల కొత్తగూడెంలో చెలరేగిన భూవివాదం పోలీసు, రెవెన్యూ అధికారుల జోక్యంతో సర్దుమణిగింది. గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకోగా, స్థానిక సర్పంచ్‌తో పాటు మరికొంత మందికి గాయాలయ్యాయి. ఈ వివాదం తీవ్ర రూపం దాల్చకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు సకాలంలో స్పందించి, ఇరువర్గాలతో చర్చలు జరిపి గొడవను సర్దుబాటు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో 226, 227 సర్వే నంబర్లలో సుమారు 3,200 ఎకరాల అటవీ భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం సర్వే నెంబర్ 227లో గుడివాడకు చెందిన కాసననేని చంద్రశేఖర్ సదరు భూముల్లో చెట్లు నరికి, తుప్పలు బాగుచేయించి జీడిమొక్కలు నాటిస్తున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ నార్ని వెంకట్రావు, కొత్తగూడెం గ్రామస్తులతో పాటు కామవరపుకోట మండలం గుంటుపల్లి, కంఠమనేని వారిగూడెంకు చెందిన సుమారు 400 మంది అక్కడికి వెళ్లి పనులను అడ్డుకున్నారు. దీంతో చంద్రశేఖర్ ఈ సర్వే నంబర్‌లోని సుమారు 570 ఎకరాలు తనవేనని, దీనికి సంబంధించి హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే ఆయా గ్రామాలకు చెందిన వారు సైతం ఈ భూముల్లో మాకు సంబంధం ఉందని పేర్కొంటూ అడవిని బాగు చేసేందుకు ఉపక్రమించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో సర్పంచ్‌తో పాటు మరికొందరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న జీలుగుమిల్లి సీఐ వెంకటేశ్వరరావు, టి.నరసాపురం, జీలుగుమిల్లి ఎస్సైలు కె.సతీష్‌కుమార్, చంద్రశేఖర్, టి.నరసాపురం తహసీల్దార్ జేవీ సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో చర్చలు జరిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ సర్వే చేస్తేనే గాని ఆ భూములు ఎవరికి చెందుతాయో చెప్పలేమన్నారు. ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటివరకు ఈ భూముల్లోకి ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో గొడవ సర్దుమణిగింది. వివాదంపై జెడ్పీటీసీ సభ్యుడు సామంతపూడి బాల సూర్యనారాయణ మాట్లాడుతూ భూవివాదాలకు, వైఎస్సార్ సీపీకి సంబంధం లేదనారు.

శ్రీవారి ఆలయంలో ఆక్టోపస్ మాక్ డ్రిల్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో ఆక్టోపస్ సిబ్బంది శనివారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించారు. స్థానిక పోలీసులతో కలసి సుమారు 40 మంది ఆక్టోపస్ సిబ్బంది ఉగ్రవాదంపై ఎలా పోరు జరపాలని రిహార్సల్స్ చేశారు. ఆలయంలోకి చొరబడిన ఉగ్రవాదులను ఎలా ఎదుర్కోవాలనే దానిపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదుల చొరబాట్లతో ఏర్పడే అత్యవసర పరిస్థితుల నుంచి భక్తులను కాపాడేందుకే ఈ మాక్ డ్రిల్ నిర్వహించినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన ఈ మాక్ డ్రిల్ సుమారు అర్ధరాత్రి 1 గంట వరకు జరిగింది.

క్లుప్తంగా

వరాల వెంకన్నకు విశేష పూజలు



అత్తిలి మండలం ఈడూరులో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ నిర్వహించారు. ఉదయం అర్చనలు జరిపి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను చేశారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

తణుకులో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

తణుకు: దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అని స్వాతంత్ర్యం సమయంలో అనేక త్యాగాలు చేసిన ఘనత ఉందని సమాఖ్య జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, నియోజకవర్గ అధ్యక్షుడు గంటా పవన్‌లు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలోని పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో అనేక మంది తమ ప్రాణాలు అర్పించిన చరిత్ర ఏఐఎస్ఎఫ్‌కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి గౌతమ్, ఎస్.శైలజ, డి.సిరి, పి.స్వాతి, ఎం.జయలక్ష్మి, ఆర్.నిస్సి పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు ప్రారంభం



తాడేపల్లిగూడెం మండలం పడాల గ్రామంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు తాము పండించిన పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని, ఈ ప్రక్రియ ప్రారంభమైందని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని పడాల గ్రామంలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ రైతు తమ పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవడం వల్ల ప్రభుత్వ రాయితీలు లభిస్తాయన్నారు. పంటను ఆర్బీకేల్లో విక్రయించడానికి అనువుగా ఉంటుందన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

సాక్షి, భీమవరం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో చేపట్టిన దశల వారీ పోరాటంలో భాగంగా శనివారం భీమవరం కలెక్టర్ కార్యాలయం సమీపంలో 12 గంటల ధర్నా నిర్వహించారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బీహెచ్ జవహర్‌లాల్‌రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎస్, నూతన విద్యా సంస్కరణలను రద్దు చేయాలని, జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపల్ విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌ప్రకాష్ వైఖరిని ఖండిస్తూ, బదిలీలు, ప్రమోషన్లలో ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని, ఉపాధ్యాయులకు బోధ నేతర పనులు విధించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్.సాయి శ్రీనివాస్, బి.గోపి మూర్తి, పీఎస్ విజయరామరాజు, ఏకేవీ రామభద్రం, కేవీ రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

సాయి భక్తుల తీర్థయాత్ర

కాళ్ల: అధిక శ్రావణమాసం ఏకాదశి మహాపర్వదినాన్ని పురస్కరించుకొని సాయిబాబా సేవకులు పుణ్యక్షేత్రాలకు శనివారం బయల్దేరారు. సాయిబాబా ట్రస్టు ఆధ్వర్యంలో బయలుదేరిన సాయిభక్తులు 52 వారాలు సేవచేసి 53వ వారంలో బస్సుల్లో యాత్రగా వెళ్లారు. కాళ్ల మండలం సీసలి గ్రామంలోని షిర్డీసాయి దేవస్థానం నుంచి సుమారు 300 మంది సాయి సేవకులు, భక్తులు బయల్దేరారు. తొలుత బాబావారికి ప్రత్యేకపూజలు చేశారు. ర్యాలీ, వాడపల్లి, అన్నవరం, ద్వారపూడి, పిఠాపురం, పెనుగొండ ప్రాంతాల్లో యాత్ర కొనసాగుతుందని, భక్తులకు అల్పాహారం, తాగునీరు, మజ్జిగ, భోజనం తదితర సదుపాయాలు దేవస్థానం తరుపున అందిస్తున్నట్టు ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతి దేవి తెలిపారు.

సొంతింటి కల...నెరవేరిన వేళ

- జగనన్న కాలనీల్లో చురుగ్గా ఇళ్ల నిర్మాణాలు
- అన్ని వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం
- లబ్ధిదారుల హర్షం

ఇరగవరం: పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలందరి ప్రధాన కోరిక సొంతిల్లు, మంచి ఇల్లు కట్టుకుని పిల్లా పాపలతో సంతోషంగా ఉండాలని కలలు కంటారు. కానీ నేటి పరిస్థితుల్లో ఆ కోరిక చాలా మందికి కలగా మిగిలిపోయింది. అయితే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల కలను సాకారం చేశారు. పేదలందరికీ ఇళ్లు ఇస్తానని ఎన్నికల సమయంలో ఆయన హామీ ఇచ్చారు. ఆ మేరకు అధికారంలోకి రాగానే కార్యాచరణ చేపట్టారు. నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు ప్రతిష్టాత్మకంగా అమలు చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడం కోసం ఇరగవరం, తణుకు, తణుకు అర్బన్, అత్తిలి మండలాల్లో 120 లే అవుట్లు ఏర్పాటు చేసి వాటిలో 12,342 మందికి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇప్పటికే 3,803 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 9,387ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయి. ఇంకా రెండో ఫేజ్‌లో లే అవుట్లు ఏర్పాటు చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ త్వరలో చేపడతారు.

ఇంటి నిర్మాణానికి సాయం

జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి వీలుగా లబ్ధిదారులకు రూ. 1.80 లక్షలను ప్రభుత్వం అందజేస్తుంది. ఈ నగదు బేస్‌మెంట్, రూఫ్ లెవల్, శ్లాబ్, నిర్మాణం పూర్తయ్యాక వివిధ దశల్లో అందజేస్తారు. ఈ నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. అలాగే సొంత స్థలం ఉన్నా వారికి ఈ పథకం వర్తింపజేస్తున్నారు. 1.50 సెంట్లు ఉన్న వారు అర్హులు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహ నిర్మాణ శాఖ ఈ అవకాశం కల్పిస్తుంది.

ప్రతిపక్షాలతో కోర్టు వివాదాలు......

పేదలందరికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాడాన్ని ప్రతిపక్ష పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నారు. వారు కొన్ని స్థలాల విషయంలో కోర్టుకు ఎక్కడంతో అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు దక్కలేదు. ఆ ఒక్క గ్రామంలో ఈ సమస్య ఏర్పడింది. మిగిలిన గ్రామల్లో సమస్యలు ఉన్నప్పటికీ వాటిని పరిష్కారించడం జరిగింది.





గోటేరు గ్రామంలో జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన ఇళ్లు

అద్దె కట్టలేక ఇబ్బంది పడ్డాం



సొంతిల్లు లేక పోవడంతో అద్దె కట్టుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డాము. ప్రతి నెలా రూ. 2500 నుంచి 3000 వరకు అద్దె చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడేది. మండల కేంద్రంలో ఈ అద్దెల భారం మరీ ఎక్కువగా ఉండేది. నా సొంతింటి కల నేరవేరడం ఆనందంగా ఉంది.

– జుత్తిగ సత్యనారాయణ, లబ్ధిదారుడు, గోటేరు గ్రామం

జగనన్న మేలు మరువలేం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మేలు మరువలేం. ఆయన చొరవతో సొంతిళ్లు నిర్మించుకున్నాం. త్వరలో గృహ ప్రవేశం చేసుకుంటాం. మండలంలోని నా 1.50 సెంట్ల స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణం కోసం రూ. 1.80 లక్షలు అందించారు. – ఎం.బేబీ, గోటేరు గ్రామం

జోరుగా ఇళ్ల నిర్మాణం



నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు జోరుగు సాగుతున్నాయి. మొత్తం 12342 మంది లబ్ధిదారులు ఉన్నారు. అందులో 2,820 మంది ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. వీటిలో 3,803 గృహలు పూర్తయ్యాయి. 9387 గృహలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. విద్యుత్, తాగునీరు, రోడ్లు, మౌలిక వసతులు కల్పిస్తున్నాం. పేజ్ 2కి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది.

డి.టి.వి.ప్రసాద్, తణుకు హౌసింగ్ డిఈ

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించండి



14వ వార్డులో మొక్కలను నాటుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రకృతి సంతుల్యాన్ని కాపాడేందుకు మొక్కలు నాటాలని పట్టణంలోని 14వ వార్డు ఇంచార్జ్‌లు నీరుకొండ పండు, మిద్దె ఆదినారాయణలు అన్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు నా భూమి– నా దేశం, నేల తల్లికి నమస్కారం కార్యక్రమంలో భాగంగా శనివారం వార్డులో మొక్కలు నాటారు. మొక్కలు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని, ప్రతి ఒక్కరికి ప్రాణ వాయువు అందించే శక్తి మొక్కలకు ఉందన్నారు. మొక్కలను ప్రతీ ఒక్కరూ నాటి వాటిని సంరక్షణ చేయాలని పిలుపునిచ్చారు. సచివాలయం కన్వీనర్ బద్ది జ్యోతి, డిజిటల్ సెక్రటరీ నిరీషా, వెల్ఫేర్ సెక్రటరీ కృష్ణవేణి, వీఆర్ఓ ధనలక్ష్మి, సెక్రటరీలు సాయి రాజు, ప్రసాద్, దివ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

గూడెంలో 18.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 18.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ శనివారం తెలిపారు. పెంటపాడు మండలంలో 15.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

మళ్లీ ముఖ్యమంత్రిగా జగనే రావాలి

- పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి
- తణుకు 9వ వార్డు గడప గడపకు మన ప్రభుత్వం

తణుకు అర్బన్: పేదరికం ప్రమాణికంగా తీసుకొని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 9వ వార్డు మునిసిపల్ కార్యాలయ ప్రాంతంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కారుమూరి హాజరై మాట్లాడారు. పేదవర్గాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సంక్షేమ పథకాలను సృష్టించి పారదర్శకంగా అమలుచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రతి గడప గుండెల్లో పెట్టుకుని చూసుకుంటుందన్నారు. ఏ గడపలోకి వెళ్లినా రావాలి జగన్ కావాలి జగన్ అనే నినాదమే వినిపిస్తుందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అవినీతికి తావులేకుండా సంక్షేమాన్ని అందిస్తున్న ఇటువంటి ముఖ్యమంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదని మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకుంటామని ముక్తకంఠంతో చెబుతుండడం విశేషమన్నారు. ముఖ్యంగా అమ్మ ఒడి, విద్యాకానుక, గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో మా పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుంటున్నామని చెబుతున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్థానిక నివాసితులు తెలిపిన సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా మంత్రి కారుమూరి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఈ రామకిషోర్, హౌసింగ్ ఏఈ వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, వార్డు నాయకులు పిల్లి సూరిబాబు, పంపన సుబ్బారావు, తాటిపర్తి వాసు, పిల్లి సత్యనారాయణ, సానబోయిన మల్లిఖార్జున రావు, కుడుపూడి చంద్రరావు పాల్గొన్నారు.



తణుకులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు పథకాలను వివరిస్తున్న మంత్రి కారుమూరి

ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు సభ్యునికి మంత్రి అభినందన



ముద్దాపురం 10వ వార్డు సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గమిడి శ్రీనును అభినందిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: మండలంలోని ముద్దాపురం గ్రామంలో ఇటీవల జరిగిన పదో వార్డు సభ్యుని ఎన్నిక ఏకగ్రీవం కావడంతో వార్డులోని అభివృద్ధి పనులకు పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు రూ. 5 లక్షలు మంజూరు చేశారు. ముద్దాపురం గ్రామ పంచాయతీలోని 10వ వార్డు సభ్యునిగా గతంలో ఎన్నికైన గమిడి వేణుగోపాల కృష్ణ అకాల మృతితో ఏర్పడిన ఉప ఎన్నికల్లో అతని కుమారుడు గమిడి శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా శనివారం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి మంత్రి కారుమూరిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనును అభినందించిన మంత్రి కారుమూరి వార్డు సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ. 5 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తుమ్మగంటి నాగ సత్యనారాయణ, నాయకులు ముళ్లపూడి బాబూరావు, సుబ్బారావు, తుమ్మగంటి సీతారాముడు, బొత్సా బాలాజీ, పల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే జీవితం అగమ్యగోచరం

తాడేపల్లిగూడెం: ర్యాగింగ్‌కు పాల్పడితే విద్యార్థుల జీవితం అగమ్యగోచరంగా మారుతుందని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు అన్నారు. శనివారం శశి ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ దినోత్సవం సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. విద్యార్థులకు జ్యుడీషియల్ చట్టాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్సై సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ నమోదై విచారణలో ర్యాగింగ్‌కు పాల్పడినట్టు రుజువైతే చదువుకోడానికి, ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి అర్హత కోల్పోతారన్నారు. విద్యార్థులు మంచి ప్రవర్తనతో ఉండాలని రిటైర్డు ఎంఇఓ రామరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి అన్నమణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అప్పిరెడ్డి, డైరెక్టర్ భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శశిలో యాంటీ ర్యాగింగ్ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్

పెంచిన రైల్వే టికెట్ చార్జీలను తగ్గించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంచిన రైల్వే టికెట్ చార్జీలను తగ్గించాలని, రైల్వే ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయు, సీపీఎం నాయకులు ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. తాలూకా రైల్వే గూడ్స్ షెడ్డు వర్కర్స్ యూనియన్ నాయకులు చిర్ల పుల్లారెడ్డి, సత్తి కోదండరామిరెడ్డిలు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కరోనా వచ్చిన నాటి నుంచి ప్యాసింజర్ రైళ్లు రద్దు చేసిందని తెలిపారు. అన్ని ట్రైయిన్‌లు, ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చడం, ప్రయాణ టికెట్ రేట్లును ఎక్స్‌ప్రెస్ రేట్లుగా మార్చడంతో సామాన్యులకు రైలు ప్రయాణం భారంగా మారిందన్నారు. కర్రి సాయిరెడ్డి, అడపా ఆంజనేయులు, వెంకట్రావు, ఎస్‌వీఎస్ రెడ్డి, సుబ్బిరెడ్డి, నారాయణ, నాని, ఎం.పుత్రయ్య, ఎ.కృష్ణ, కర్రి శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

విదేశీ విద్యకు ఆంగ్ల పరిజ్ఞానం అవసరం

సాక్షి, భీమవరం: ఉన్నత విద్యనభ్యసించడానికి విదేశాలకు వెళ్లే విద్యార్థులకు ఆంగ్లభాషను చక్కగా వినడం, మాట్లాడడం వంటి నైపుణ్యాన్ని అధ్యాపకులు అందించాలని ఢిల్లీకి చెందిన ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్) అకడమిక్ హెడ్ రష్మీ గేరా అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకులు, టోఫెల్ వంటి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలా శిక్షణ అందించాలని అంశంపై శనివారం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. ఇంగ్లిష్ భాషలో వస్తున్న ఉపన్యాసంలోని మూలాలను బాగా అర్థం చేసుకునేలా విద్యార్థి శిక్షణ పొందాలన్నారు. ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు, బీహెచ్‌వీఎస్ లక్ష్మి, కేవీ మురళీకృష్ణంరాజు, నడింపల్లి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు విలువలు నేర్చుకోవాలి



వాసవీ స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న జేఎన్‌టీయు వీసీ ప్రసాదరాజు

తాడేపల్లిగూడెం: విద్యార్థులు విద్యతో పాటుగా విలువలను కూడా కలిగి ఉండాలని జేఎన్‌టీయు కాకినాడ ఉపకులపతి ప్రొఫెసర్ జి.విఆర్.ప్రసాదరాజు అన్నారు. వాసవీ ఇంజనీరింగ్ కళాశాల రెండో స్నాతకోత్సవం పెదతాడేపల్లిలో శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా వీసీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయు కాకినాడ అనుబంధ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు అందించే సంస్థ వాసవీ ఇంజనీరింగ్ కళాశాల ఒకటన్నారు. విద్యార్థులు విలువల గొప్పతనం తెలుసుకున్నప్పుడే సాధించిన డిగ్రీలకు విలువ ఉంటుందన్నారు. 2023 సంవత్సరానికి ఉత్తమ విద్యార్థినిగా ఎంపికైన జె.యజ్ఞరమ్యశ్రీకి బంగారు పతకాన్ని అతిథులు అందచేశారు. వివిధ విభాగాలలో ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిధి హెక్సావేర్ సంస్థ ప్రధాన హెచ్ఆర్, సొగటా సేన్, త్రీ ఎఫ్ టెక్నికల్ డైరెక్టర్ ,వాసవీ బీటీజీ అధ్యక్షులు ఓపి.గోయంకా, కళాశాల పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, కోశాధికారి బాలకాశయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకరరావు పాల్గొన్నారు.

నేడు రసరాజు గ్రంథావళి ఆవిష్కరణ సభ

తణుకు: తణుకు పట్టణానికి చెందిన నన్నయ్య భట్టారక పీఠం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత రసరాజు రచించిన మూడు గ్రంథాల ఆవిష్కరణ సభ ఈనెల 13న ఏర్పాటు చేసినట్లు పీఠం నిర్వాహకులు తెలిపారు. సజ్జాపురంలోని రామకృష్ణసేవా సమితి భవనంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత గజల్ గాయకులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. రసరాజు రచించిన ద్వారా తోరణం, సాగిరావే సరిగమలా, వేదిక గ్రంథాలను శ్రీనివాస్ ఆవిష్కరించనున్నారు.

ఘనంగా గ్రంథపాలకుల దినోత్సవం

తణుకు టౌన్: ప్రజలకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల పాలకులు నిజమైన పుస్తక ప్రేమికులని తణుకు సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు చెప్పారు. శనివారం గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగరాధన్ జయంతి సందర్భంగా గ్రంథపాలకుల దినోత్సవాన్ని నిర్వహించారు. తణుకులోని బ్యాంక్ కాలనీలో గల పురుషుల గ్రంథాలయంలో గ్రంథ పాలకులని సత్కరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పాలకులకు అందిస్తున్న సేవలను పాఠకులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, మన నేస్తాలు, గమనం, గమ్య గ్రంథాలయాలే అనే అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి గుత్తికొండ కృష్ణారావును సత్కరించారు. పాతూరు సురేష్ కుమార్, గొలుగూరి శ్రీనివాసరెడ్డి, గుత్తికొండ స్రవంతి, ఆకెళ్ల శ్రీనివాస్, టీ రామసూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీఓ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

తణుకు అర్బన్: ఏపీ ఎన్జీఓల 21వ రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఈనెల 21, 22 తేదీల్లో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర మహాసభలకు హాజరుకావాల్సిందిగా ఏపీ ఎన్జీఓస్ తణుకు శాఖ సభ్యులు శనివారం మంత్రి కారుమూరిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధుల్లా పనిచేస్తున్న ఏపీ ఎన్జీఓలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఉద్యోగులపై ప్రభుత్వం ఎప్పుడూ సానుకూలంగానే వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్‌వీ నరసరాజు, కార్యదర్శి కేవీ సత్యనారాయణ (పండు), అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, అసోసియేట్ అధ్యక్షుడు ఐ.శ్రీనివాసరావు, కోశాధికారి ఆర్‌వీఎస్‌బీ రాయుడు, ఉపాధ్యక్షురాలు కేకే సుభాషిణి, ఉమెన్ వింగ్ చైర్మన్ ఎం.రవీంద్ర భారతి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

నేడు మానవత జిల్లా సమావేశం

పెంటపాడు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా సమావేశం ఆదివారం సాయంత్రం పెంటపాడులో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు, కార్యదర్శి కేఎస్ఎన్ మూర్తిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మానవత కేంద్ర నియంత్రణ కమిటీ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావుతో పాటు, జిల్లా స్థాయిలోని అన్ని విభాగాల సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరై జిల్లా ఎజెండా అంశాలతో పాటు, సభ్యత్వాలు, పలు సేవాపరమైన అంశాలు చర్చించనున్నట్లు తెలిపారు.

తేతలిలో ఒక నామినేషన్ ఉప సంహరణ

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామ 8వ వార్డు ఉప ఎన్నికలకు సంబంధించి దాఖలైన నామినేషన్‌ల్లో శనివారం ఒక నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. తేతలి గ్రామానికి చెందిన కోట విజయ పార్వతి తన నామినేషన్‌ను ఉప సంహరించుకున్నారు. దీంతో ఇంకా ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. నామినేషన్ల ఉప సంహరణకు ఇంకా సమయం ఉండటంతో పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా, గుర్తులను ఆదివారం ప్రకటిస్తారని తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, భీమవరం: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించకపోతే మరో పోరాటానికి సిద్ధమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్ అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం జరిగిన మాస్ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ సీఐటీయూ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తున్నాయన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

పాలకోడేరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఈశా గ్రామోత్సవం ఘనంగా ప్రారంభమైంది. గ్రామీణ భారతదేశ సంస్కృతి, సంప్రదాయాల స్ఫూర్తిని పునరుజ్జీవింపచేయడానికి ఈ గ్రామోత్సవాలు దోహదపడతాయని భీమవరం హాస్పిటల్ ఎండీ డాక్టరు గోపాలరాజు, లయన్స్ క్లబ్ చైర్మన్ కృష్ణంరాజు అన్నారు. రెండు రోజుల క్రీడల్లో తొలిరోజు పురుషులు వాలిబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 26 జట్లు పాల్గొన్నాయి. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశా జిల్లా సమన్వయకర్త డాక్టరు విజయ మాట్లాడుతూ క్లస్టర్, డివిజన్, ఫైనల్ స్థాయిలో 3 దశలో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు రూ.56 లక్షల నగదు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. ఆదివారం బాలికలు, యవతులకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మరియమ్మ, ఉపసర్పంచ్ వెంకటరాజు, విశ్వనాధ్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల దృశ్యం